ఇక్కడ అప్పారావు చేసిన పొరపాటు ఆ ప్రాంత వివరాలు చెప్పి ఆ బిల్డింగ్ ఎవరికయినా తెలుసా అంటూ తన అనుచరుల్ని చూస్తూ అడగడం, తెలుసని ఒక అనుచరుడు ముందుకు రావడంతో హరిత, యశస్విలతో పాటు కార్లలో బయలుదేరారు.

ఇదంతా ఓ వ్యక్తి కిటికీవారగా నిలబడి వింటున్నాడని అప్పారావు వూహించలేదు.

ఆ వ్యక్తి మన్మధరావు.

*   *   *   *

యశస్విని చూడగానే 'అంకుల్' అంటూ వాళ్లని చుట్టేశాడు నానీ.

"నన్ను గట్టిగా కొడుతున్నారంకుల్" నీరసంతో వెక్కిపడుతున్నాడు.

"నువ్వు నిజం చెప్పమన్నావు..... అందరూ నన్ను చంపేస్తామంటున్నారన్న మాట. అయినా నేను అబద్ధం చెప్పనుగా".

నానీని చూస్తుంటే యశస్వి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

హరిత కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఓ మూల అప్పారావు, అతడి అనుచరులు మరోపక్క నిజం చెప్పకపోతే కాల్చేస్తానంటున్నట్టు రివాల్వర్ పట్టుకుని నిలబడిన హరి.

"చెప్పుబే.... తీసుకొచ్చాంగా" హరి అరిచాడు నానీని చూస్తూ.

ఇంకా ఏదో అనుమానంగా వుంది. ఇది చెప్పాక కూడా తన గురించి కాదుగాని అంకుల్‌ని ఆంటీని చంపేస్తారన్న భయంగా వుంది. చెప్పనా అన్నట్టు యశస్వికేసి చూశాడు నానీ.

మొన్న చెప్పమని అడిగిందీ నువ్వేగా అంకుల్ అన్న ప్రశ్న ఉందా చూపుల్లో. ఇప్పుడు చెబితే ఏమౌతుందో అన్న భయమూ వుంది.

"చెప్పరా గుండునాయాలా....." అప్పారావు అరిచాడు.

"మాట్లాడమంటుంటే" ఈ సారి ఓ ఇనుప చువ్వతో నానీ చేతిపై మోదబోయేసరికి అది యశస్వి చేతికి తగిలి ఎముక విరిగినట్టు కలుక్కుమంది.

"అ....మ్మా......" అన్న ఓ ఆక్రందన్ని గొంతులోనే సమాధి చేసుకున్నాడు యశస్వి.

ఈసారి ఇనుపచువ్వ యశస్వి ఒంటిపై కసిగా తాకింది. ఒకటి కాదు రెండుకాదు... ఎన్నిసార్లో అప్పారావుకే గుర్తులేదు. యశస్వి శరీరం గొడుగులా మారి గువ్వలా గుండెల్లో ఒదిగిన
నానీకి దెబ్బ తగలకుండా కాపాడుతూంది.

యశస్వి శరీరం రక్తసిక్తమై పోయింది. శరీరం పట్టు తప్పి పోతూంటే ఆగమన్నట్లు సంజ్ఞ చేశాడు యశస్వి. గెలుపు తమదే
అన్న సంతృప్తి ప్రత్యర్థుల అందరి కళ్లల్లో.....

"నానీ.... చెబుతాడు..... కాని ఓ షరతు...." తను ఏమాత్రం తొందరపడినా

నానీ ప్రాణాలు పోతాయని తెలిసిన యశస్వి చివరగా ఈ పోరాటంలో తను ఆహుతి కావడనికి సంసిద్ధుడయ్యాడు "హరితతో బాటు నానీ బయటకి వెళతాడు. మీలో ఒక్కరు ఫాలో అవ్వండి. నానీ ఆ రోల్ మీకిచ్చేశాక నానీని, హరితని మీరు విడిచిపెట్టాలి? నానీని మీరు రామసూరికి అప్పచెప్పాలి. నానీ, హరితలు క్షేమంగానే వున్నారని రామసూరి నాకు ఫోన్‌లో చెప్పాలి? అంతవరకూ నేను ఇక్కడే మీ అధీనంలోనే
వుంటాను. ఆ తర్వాత నన్నేం చేయాలన్నదీ మీ ఇష్టం."

ఇది కొంచెం సమంజసంగానే వుందనిపించింది అప్పారావుకి "అది సరే.... ఆ తర్వాతయినా నానీ నీ గురించి ఇక్కడ జరిగిందాన్ని వాగడని గ్యారంటీ ఏమిటి?"

"అది చెప్పిన మరుక్షణం మీరు నన్ను చంపేస్తారు. అందుకు నానీ నా సంగతి చెప్పడు అయినా.....
అసలు ప్రమాదాన్ని తెచ్చేది ఆ ఫిల్మ్ రోల్ కాబట్టి నానీ ఇంకేం చెప్పినా
నిన్ను నువ్వు రక్షించుకోగలవు అప్పారావ్."

"వద్దంకుల్ నేను బయటకి వెళ్ళాక నిజం చెపుతాను" ఏడుస్తూ అన్నాడు నానీ.

"నా మాట విను నాన్నా.... మంచి నానీవిగా."

"వద్దంకుల్....."

"ఓరే గుండు నా కొడకా.... ఇటుచూడు.... నువ్వు వెంటనే బయల్దేరకపోతే ఇదిగో మీ ఆంటీని ఇలాగే కాల్చేస్తాను" హరిత జుట్టు పట్టుకున్న హరి రివాల్వర్ ఆమె చెంపకి ఆనించాడు.

"అయిదంకెలు లెక్క పెడుతున్నాను. నువ్వు బయలుదేరకపోతే మీ ఆంటీని కాల్చి పారేస్తాను...... ఒకటి.... రెండు.....మూడు....."

నానీ కట్టెలా బిగుసుకుపోయి చూస్తున్నాడు.

"నాలుగు...."

యశస్వి బలాన్ని కూడగట్టుకున్నాడు.

"అయిదు....." అని ఇంకా అనలేదు.

రివాల్వర్ పేలిన చప్పుడైంది.

నానీ భయంతో కళ్ళుమూసుకున్నాడు.

రివాల్వర్ పేల్చింది హరి అనుకున్నాడు. కాని అది పేలింది అక్కడ అడుగుపెట్టిన డి.జి.పి. చేతిలోనుంచి.

హరి భుజంలోనుంచి రక్తం ధారగా కారుతుంటే మూలుగుతూ క్రిందపడ్డాడు. బయటికి పరుగెత్తబోయిన అప్పారావూ
అతడి అనుచరుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

"మిస్టర్ అప్పారావు.....నీ అంత్య
క్రియలకి నువ్వే చితిని పేర్చుకున్నావు. రేపు నువ్వేమిటో తెలిసిన ప్రజలు ఇక జేజేలు పలకరు.... నీ ముఖాన ఉమ్మేసి నీలాంటి కుహనా రాజకీయ నాయకుల నీ బ్రతుక్కి ఓ గుణపాఠంగా చరిత్ర రాస్తారు.....కమాన్."

* * * *

ఉదయం పదిగంటల వేళ.

డి.జి.పి. గెస్ట్‌హౌస్‌లో ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశాడు.

ముందు వరసలో కూర్చున్న యశస్వి చేతికి బేండేజీతో నుదుట ప్లాస్టర్‌తో వచ్చాడక్కడికి.

డి.జి.పి. పక్కన కూర్చున్న నానీ ఇప్పుడూ ఓ పసికందులానే వున్నా ఒక జీవితకాలానికి సరిపడినంత అలసట..... చెంపలపై కన్నీటి చారలింకా చెరిగిపోని నానీ ఇబ్బందిగా చూస్తున్నాడు- ఎదురుగా కూర్చుని చిన్నగా నవ్వుతున్న హరితని.

"డియర్ ఫ్రెండ్స్...... నేరస్థుల్ని నిర్ధారించేది చట్టమే అయినా నే నిక్కడ మిమ్మల్ని పిలిచింది ఎవరినో సమర్థించడానికి గాని మరెవర్నో కించపరచడానికి కాని కాదు..... సుమారు తొమ్మిది రోజులుగా మనందర్నీ కలవరపరిచిన కథని, అందులోని వాస్తవాన్ని మీకు తెలియజేయాలని మాత్రమే..... ఈ కథకీ కీలకమైన పాత్రధారి ఇడుగో నానీ.... తనవాళ్ళ
చేతనే చంపబడే పరిస్థితిలో తాతయ్యచేత తరిమేయబడ్డాడు.... తనను వెంటాడుతున్న మనుషులనుంచి తప్పించుకుని హోం మినిష్టర్ చేతికి దక్కాడు..... ఒక బాధ్యతగల మంత్రి వర్యులు ఒక సమస్యలో ఇరుక్కుని నానీని అంతం చేయాలని ఒక పక్క ప్రయత్నిస్తుంటే మరో పక్కన నానీని కాపాడాల్సిన పోలీసుల్లో కొందరు తామూ నానీని హత్య చేసే కార్యక్రమంలో నిమగ్నమై పోయారు..... నేరస్థుడన్నవాడు ఏ పదవిలో ఉన్నా కొన్ని రోజులపాటు చట్టం నుంచి తప్పించుకోగలడు కాని అన్ని రోజులూ అందర్నీ మోసం చేయలేడు.... దానికి పర్యవసానమే హోం మినిస్టర్ బర్తరఫ్ గావడమూ, డి.యస్పీ. సుందర్ తప్పించుకోవడమూను....

నా డిపార్ట్‌మెంట్‌కి
కళంకం తెచ్చిన వాళ్ళ విషయంలో సిగ్గు పడుతున్నాను. మాకూ అటువంటి చరిత్ర మిగిలిందీ ఇకముందు మిగులుతుందీ అని సగర్వంగా
చెప్పుకోవడానికి కొందరు ఆణిముత్యాలున్నారు..... అలాంటి వాళ్లలో ఒకడు యశస్వి...
" క్రిందికి దిగి వచ్చి యశస్విని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

"ఈ అపారమైన ప్రయాణంలో అతడికి అసాధరణమైన సహాయాన్ని అందించింది మీ పత్రికలు. ముఖ్యంగా మీ జర్నలిస్టుల లోకమంతా గర్వించదగ్గ రామసూరి....".

రామాసూరి తల పైకెత్తలేదు....

"వీళ్ళు ముఖ్యులైతే ఇందులో ఇంకా వీరికి సహకరించిన వాళ్ళెందరో వున్నారు. చావుబ్రతుకుల మధ్యనున్న కాటికాపరి తవిటయ్య, మన్మధరావు.... ఈ కదలిక్కి ముందు స్ఫూర్తి గా నిలిచి తను లేకుండా పోయిన రాందేవ్."

"సర్" ఓ విలేఖరి లేచాడు "రాందేవ్ నానీ కిచ్చిన ఫిల్మ్‌రోల్ మాటేమిటి"

"ఇదిగో నా దగ్గరుందన్న మాట" ఓ అరగంట క్రితమే హరితతో బాటు వెళ్ళి తీసుకొచ్చిన నానీ జేబులోనుంచి తీసి చూపించాడు.

"ఎక్కడ దాచావు దాన్ని?" అడిగాడు విలేఖరి.

"ఆ రోజు నన్ను దొంగని పోలీసు అంకుల్స్ వెంటబడితే దాగున్నానే శివాలయం... కాశీనాధ తాతయ్య వుంటాడన్న మాట.... అక్కడ దేవుడి దగ్గర దాచేశాను."

నానీ లేచాడు... "రాందేవ్ అంకుల్ చచ్చిపోతూ అన్నాడు ఆ రీలు పోలీసులకిమ్మని"

ఇన్నాళ్ళూ అనుమానించాడు కాని ఇంతకాలానికి డి.జి.పి. మంచి పోలీసంకుల్ అనిపింపించింది.

"అందులో ఏముంది?" రామసూరి అడిగాడు నవ్వుతూనే.

"నిజం అన్నాడు చచ్చిపోయిన అంకుల్."

"చూశావా?"

"ఓ..." టక్కున జవాబు చెప్పిన నానీ రోల్ మొత్తం తెరిచాడు.

"కానీ నిజమెక్కడా కనిపించలేదు.... అంతా ఖాళీ" అన్నాడు అక్కడున్న అందరికీ ముచ్చెమటలు పోశాయి.

ఇన్ని రోజులుగా అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఫిల్మ్ రోల్ అమాయకంగా తెరిచి చూసి నిజం కోసం వెదికాడు.... ఎక్స్‌పోజ్
చేసేశాడు.

ఒక నేరస్థుడిగా అప్పారావును రెడ్‌హేండేడ్‌గా పట్టుకున్న డి.జి.పి. కి నిజానికి రాందేవ్ హత్య విషయంలో చాలా అవసరమే..... కాని ఆధారం చేజారిపోయింది.

"తెరవాల్సింది కాదు నానీ" డి.జి.పి. అన్నాడు నెమ్మదిగా.

"కాని 'నిజం' వుంటుందంటేనూ తెరిచానన్నమాట"

"ఇపుడేమౌతుంది" డి.జి.పి. ని అడిగాడో విలేఖరి .

డి.జి.పి. అన్నాడు "నేరాన్ని నిరూపించడానికి ఆధారాలు అవసరమే కాని ఆధారమొక్కటే హంతకుడ్ని పట్టివ్వదు.... ఈ విషయం తెలీని అప్పారావు, హరి రాందేవ్ హత్య మొదలుకుని మోటివ్స్‌తో సహా అంతా అంగీకరించా రప్పుడే"

నానీ ఆసక్తిగా వింటున్నాడు.

ఆ సాయంకాలం హరిత- నానీలతో యశస్వి
బయలుదేరుతుంటే రామసూరి వచ్చాడు చివరగా "సాధించావు యశస్వి! అంతకుమించి స్తబ్ధంగా పడివున్న నన్నూ కదిలించి ఎందుకీ ప్రయాస అనుకుంటున్న నా బ్రతుక్కి ఓ పరమార్ధముందని పరోక్షంగా తట్టిలేపావు....
" నానీని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు "ఒరేయ్ సత్యాన్వేషీ....
నువ్వు వెయ్యేళ్ళు బ్రతకాలిరా.....? నీ బ్రతుకు ఎందరికో మార్గదర్శకం కావాలి.... అన్నట్టు వీళ్లు నన్ను మర్చిపోతారేమో... గుర్తు చేస్తుండేం! ముఖ్యంగా వీళ్ళిద్దరి పెళ్ళికార్డూ నువ్వు దగ్గరుండి పంపించు. మరేం లేదు.... మనిద్దరం వీళ్ళకి పెళ్ళి పెద్దలమై పోదామన్న మాట" తలూపాడు నానీ అర్ధమయిందన్నమాట అన్న ధోరణిలో.

* * * *